# వెడ్డింగ్ లుకింగ్స్

మూర్తి సన్నగా, రివటలా ఉంటాడు.

ఎప్పుడూ చొక్కాని ప్యాంట్‌లోకి తోసేస్తాడు. ప్యాంట్ జారిపోకుండా బెల్ట్ పెట్టుకుంటాడు. అతను ఒక సాఫ్ట్‌వేర్ కంపెనీలో మంచిజీతం తీసుకుంటున్నాడు. ముఖానికి షోకైన ఫ్రేమ్‌లో చిన్ని కళ్ళద్దాలు, పెద్దవాళ్ళు 'మంగళ, శుక్రవారాలు గెడ్డం గీసుకోకురా బాబూ..!' అని నెత్తీనోరూ బాదుకున్నా సరే- గీసిపారేసే సన్నని గెడ్డం, సన్నని మీసాలు, ఆడపిల్లలా మీనాల్లాంటి కళ్ళు...

మరి, అంతా బాగానే వుంది మూర్తికి- ఇక లోటేమిటంటారా?

'పురుష లక్షణం అయిన ఉద్యోగం తరువాత, పురుషునికి వివాహం లక్షణం!' అని అందరూ అంటూ... పాపం ఇంకా ముప్ఫయ్ కూడా నిండని అతగాణ్ణి- 'వీడికి పెళ్ళి ఎందుకు అవడం లేదు? బహుశా సన్నగా ఉండడం వలన వివాహానికి అర్హుడు కాదని చెప్పారేమో?!' అనే టాక్ వచ్చేసింది బంధువర్గాల్లో.

మూర్తికి పెళ్ళి విషయంలో తల్లి, తండ్రి పూర్తిగా ఫ్రీడమ్ ఇచ్చేశారు. అందులో కొంత వాళ్ళ స్వార్థం కూడా వుందిలెండి! పెళ్ళయి కోడలు గనుక వస్తే- తమకు నెలనెలా మూర్తి నుంచి వచ్చే 'మనీ ట్రాన్స్‌ఫర్' ఆగిపోతుందనీ, అయినా కొన్నాళ్ళు బ్రహ్మచారి జీవితాన్ని ఎంజాయి చేయాలన్న కొడుకు కోరికలను అడ్డంపెట్టుకుని వాళ్ళు కూడా కాలక్షేపం చేసేస్తున్నారు.

"లలలా... లలలా..." అనుకుంటూ తల దువ్వుకుంటున్న మూర్తి సెల్ మోగింది.

"ఒరేయ్‌ఁ... బామ్మ బాల్చీ తన్నేసేట్లుగా ఉంది. నువ్వు అర్జంటుగా వచ్చి బకెట్ గట్టిగా పట్టుకో!" అంటూ నాన్న శోకాన్ని మిక్స్ చేసిన గొంతుతో చెప్పాడు.

బామ్మంటే నాయనమ్మకు అమ్మ! తొంభై సంవత్సరాల ఆవిడను ఎవరైనా సరే- "బామ్మగారూ... మీ ఆరోగ్యరహస్యం ఏమిటి?" అని సంతోషంగా అడిగితే- ఆవిడ కోపంతో "నన్నెలా అడిగాడో... ఆడి గుండెకు చిల్లుపడ!" అని దీవించేస్తుంది.

"నాన్నగారూ... బామ్మకు ఎలా వుంది?" అన్నాడు ఆందోళనతో లోపలికి రాగానే.

"నిన్న చెబుతుంటే వినకుండా ఓవర్‌గా తినేసిందిరా! బకెట్, చెంబులతో కాపలా కాసింది లెట్రిన్‌కి! తోటకూర కాడలా వేలాడిపోయి, 'మునిమనవణ్ణి చూడకుండానే చచ్చిపోతున్నా- గంగ నోట్లో పొయ్యండీ!' అంది. కాశీగంగ నీళ్లు గొంతులో పోసేశాం

'శివా శివా' అంటూ! కానీ, చిత్రం ఏమిటంటే... నీళ్లు తాగి బకెట్, జగ్గుతో సహా తోసేసి ఇంట్లోకొచ్చి మంచంమీద సెటిలైందిరా బాబూ! అప్పటికే నీకు ఫోన్ చేసేశాం. సరేలే... అని ఊరకుండిపోయాం!" అన్నారాయన.

"బామ్మా... ఎలావుంది?" అన్నాడు మూర్తి ఆందోళనతో.

మూర్తిని చూసిన ఆమె ముఖం 'సూర్యుని చూసిన సన్‌ఫ్లవర్'లా మిలమిలా మెరిసింది.

"ఆరి నీ అసాధ్యం కూలా! అదేమిటే అమ్మా... 'ఐకోడిని చూడకుండానే పోతున్నా!'- అంటూ శోకాలు పెట్టావ్?" అంటూ మూర్తి నానమ్మ వచ్చింది. ఆ వెనుకనే మూర్తి తల్లి, తండ్రి నిలబడి చూస్తున్నారు వింతగా.

"అదికాదురా అబ్బులూ! బామ్మ 'మునిమనవణ్ణి చూసేవరకూ నేను చావను గాక చావను. ఈలోగా ఒకవేళ యముడు వస్తే బుఱ్ఱ పగలకొడతా'నంటుందిరా! అందుకని నువ్వు వెంటనే మనూరు వెళ్లి, మంచి చదువుకున్న అమ్మాయి ఉందట- చూసి వచ్చెయ్! నెలరోజుల్లో నీ పెళ్ళి... సంవత్సరంలోపు అబ్బాయి పుట్టడం... బామ్మ వాడిని ఎత్తుకుని ఆడుకోవడం!" అంది మూర్తి తల్లి నవ్వుతూ.

"అమ్మా! నువ్వు ప్రోగ్రాం, ప్రోగ్రెస్, అఛీవ్‌మెంట్ అన్నీ బాగానే ప్లాన్ చేశావు గాని- నేనూ, నీ కోడలూ సంవత్సర కాలం ఉద్యోగాలు మానేయాలా?" అన్నాడు మూర్తి.

"ఆర్నీ దుంప పిలకెయ్య! మరీ ఉద్యోగాలు మానేసి సంసారాలు చేసేస్తే వొకటే కవలలు పుట్టేస్తార్రా! పోనీలే- ఒక ఆడపిల్ల, మగపిల్లాడు పుట్టారనుకో... పనయిపోతుంది ఒక్కసారే!" అంది బామ్మ.

"మరి, ఇంతమందిమి మా నోళ్ళు పారేసుకుని వాగుతున్నాం... నువ్వేం చెప్పవేంరా?" అన్నాడు మూర్తి తండ్రి.

వెంటనే నాయనమ్మ "వెధవకానా! పైనుంచి క్రిందవరకూ రెండు అరచేతులతో తడిమితే గుప్పెడు ఉండదు నీ శరీరంలో! ఆ ప్యాంటూ, షర్ట్ విప్పితే ఎవరైనా జడుచుకు ఛస్తారు. సైన్స్ చదువుకునే పిల్లలకి మనిషి శరీరంలో ఎన్ని ఎముకలు, ఎక్కడెక్కడ వుంటాయో బాగా అర్థమయ్యేట్లు చెప్పాలంటే... నీ బాడీలో చూపించొచ్చురా! తిండి తిని ఏడవ్వు కదా! పోనీ, గాలికొట్టే సౌకర్యం ఉందా... అంటే టైర్లు, ట్యూబులకు తప్పితే మనుషులకు ఆ సౌకర్యం లేదాయె!" అంది.

ఆ మాటలకి అందరూ డబ్బాలో రాళ్లేసిన సౌండ్ వచ్చినట్లుగా ఒకేసారి నవ్వేశారు.

"సరే... మీ మాట ఎందుకు కాదనాలి? మా బామ్మ బాల్చీ తన్నేసిందని శెలవు పొడిగిస్తా గాని- అమ్మాయిని చూడ్డానికి ఎప్పుడు వెళ్దాం?" అన్నాడు మూర్తి.

"ఓరి పిచ్చినాగన్నా... నన్ను చంపేశావుటరా?!" అంది బామ్మ నవ్వుతూ.

"బామ్మా... నీకు తెలుసా? చనిపోయారని ప్రచారం చేస్తే వాళ్ళు నూరేళ్లు మించి బ్రతుకుతారట. నువ్వేమో నా పిల్లాడిని కూడా ఆడించాలే!" అన్నాడు.

వెంటనే నానమ్మ చాలా చలాకీగా "వోరేయ్! ఈసారి బ్యాండ్‌మేళం వాళ్ళలాగా పెద్ద మూకలా వెళ్లడం కాదు. సింపుల్‌గా నువ్వూ, నేనూ వెళ్తున్నాం. నాకు కాలి చివరి వేలు విడిచిన మేనమామ తాలూకు పిల్ల అది!" అంది.

"అదేమిటే నానమ్మా! నీకు కుడిచేతి వేళ్లు విడిచిన మేనమామలు వున్నారని తెలుసు. మరి, కుడికాలు చివరివేలు వరకూ విడిచేసిన మేనమామలు వున్నారన్నమాట! నానమ్మా... 'వేళ్లు విడవడం' అంటే ఆ వేళ్లు కత్తితో కోసేసుకుంటారా?" అన్నాడు మూర్తి.

"భడవా! నీ కార్యం ఆరు రోజులు జరగాలి!" అంది.

నానమ్మా, మూర్తీ మర్నాడు తెల్లవారి ఆరు గంటలకు రైలు దిగారు. అక్కడ్నుంచి పెళ్ళికూతురి ఊరుకి అరగంటే ప్రయాణం!

"కరణంగారింటి కొచ్చింది తమరేనామ్మా? నాను జట్కాబండి తోలుకొచ్చాను... రండి! అయ్యగారు తవరికోసం ఇంటికాడ అడావిడిలో వుండారు!" అంటూ నోట్లో పొడుగాటి లంకపొగాకు చుట్టతో 'గుప్‌గుప్'మని పొగ వదులుతూ, తలపాగా చుట్టుకుని నిలబడి వున్నాడతను.

"నే చెప్పలా! మావాడు మర్యాదలకి లోటు చేయడు!" అంది నానమ్మ ముఖం చేటంత చేసుకుని.

"అదేదో హెలికాప్టర్ పంపించినంత సంబరపడిపోతున్నావే నానమ్మా!" అన్నాడు మూర్తి అతని వెంట వెళ్తూ.

నానమ్మా, మూర్తీ జట్కాబండిలో కూర్చున్నారు.

కొంచెం దూరం వెళ్లాక "అబ్బాయిగారు మరీ పల్చగా ఉన్నారు. మామ్మగారు సరే ముసలోరు గంద! కొంచెం ఎదరకు జరగండి బాబూ- బండి బరువు చాల్లేదు!" అని బండిచక్రం మీద కర్రతో శబ్దం చేస్తున్నాడు అదోలాగ.

మరో పది గజాలు నడిచేటప్పటికి- బండి కుదుపులకు ఒకసారి మూర్తి- బండి ఒకవైపుకు, ఇంకోసారి నానమ్మ ఇంకోవైపుకు, మరోసారి మూర్తీ, నానమ్మా ఒకరికొకరు గుద్దుకోవడం జరిగిపోతూవుంది. బండి నడక అలావుంది మరి!

"నానమ్మా! నీ వేలు విడిచినోడి మర్యాదలు బలే వున్నాయి. నీ సంగతేమో గాని- నాకు వెన్నెముక పూసలు లూజైపోయి, అమ్మాయిని చూసేటప్పుడు నిటారుగా నిలబడలేని స్థితి వచ్చేట్లుంది. పైగా, వీడి చుట్టపొగ ఒకటీ..!" అంటూ మూర్తి విసుక్కున్నాడు.

"అబ్బీఁ... ఆ చుట్ట పారేయరాదూ?!" అంది నానమ్మ.

"బలేవోరమ్మా! నాకూ, నా గుర్రానికీ ఆ చుట్టపొగ లేదనుకోండి... మనమంతా నేలమీద వుంటావండి! గుర్రం పరుగెత్తదండి... బండీ వొగ్గేసి ఎల్లిపోతాదండి!" అన్నాడు.

"వొద్దులేరా బాబూ!" అన్నాడు మూర్తి.

"అదిసరే గాని మామ్మగోరూ! మా సూరమ్మగారి నేనాండి ఈ అబ్బాయిగారు చూడ్డానికొచ్చింది? అళ్లిద్దరూ పెళ్ళయ్యాక ములక్కాడ, గుమ్మడికాయ లాగుంటారేమో! పాపం... అబ్బాయిగారు బక్కగా వున్నారండీ!" అన్నాడు.

వెంటనే నానమ్మ "అదేంట్రా- పిల్ల షలాకుగా వుంటుందని చెప్పాడే మాకు!" అంది.

"బామ్మగారూ... పెల్లి సెయ్యాలంటే ఎయ్యి అబద్దాలు ఆడాలంట గదా! అయినా తమరు మరీ ఇదై పోమాకండి! మరీ నీళ్లపీపా లాగ వుండరు గాని, సుమారుగా అలాగే వుంటారు సూరమ్మగారు. అయినా పెల్లయ్యాక అబ్బాయిగోరు మా అయ్యగారింట్లో

ఉన్నారంటే... నెయ్యి సున్నుండలూ, నెయ్యి, జీడిపప్పు, పంచదారతో చేసిన పూతరేకులూ, అరిసెలూ ఒక నెలరోజులు తిన్నారనుకోండి. ఆరు సూరమ్మగారి కన్నా డ్రమ్ములా అయిపోతా ర్లెండి!" అన్నాడు నవ్వుతూ- చుట్టపొగ రైలింజను పొగలాగ బండికి సరఫరా చేస్తూ.

'ఖళ్ళు... ఖళ్ళు'మని దగ్గసాగాడు మూర్తి.

"అమ్మగోరూ! అబ్బాయిగోరు దగ్గతా వున్నారు. ఏదైనా జబ్బుందా?" అన్నాడు బండివాడు.

"నీ అసాధ్యం కూలా! అబ్బీ... నీ చుట్టపొగతో ఊరంతా దగ్గుతోందిరా! ఆ చుట్ట ఆర్పు. ఆ పొగ మూలాన్న దగ్గుతున్నాడు బాబు!" అంది.

"అబ్బాయిగారూ! చిన్న ఇసయం చెబుతా గాని- గుబులు పడమాకండి! కత్తిపీటకి గుమ్మడికాయ లోకువంటారు... తమరికి తెల్సు కదా! మా సూరమ్మ తల్లి బండగా, పీపాలా వున్నా- తమరు సన్నగా, పీలగా వున్నారు కాబట్టి బాగా కార్యక్రమాలు జరిగిపోతాయండి. బెంగెట్టుకోమాకండి. అయినా మొగుడు సన్నగానే వుండాలండీ!" అన్నాడు.

'రాత్రిళ్ళు నిద్రలో సూరమ్మ అనబడే తన భార్య తనపై ప్రేమతో ధామ్మని కాలు వేసినట్లు, ఆ దెబ్బకు తన మోకాలిచిప్ప పగిలి, ఆపరేషన్ చేసి ఫారిన్ చిప్ప బిగించుకున్నట్లుగా-

వరలక్ష్మీవ్రతం రోజున అమ్మ పాడే మంగళహారతి 'వరలక్ష్మీ తల్లీ! నిన్నెట్లా ఎత్తుకుందు నమ్మా!' పాట గుర్తుకొచ్చి, ఆమెను నేను ఎత్తుకోవడమా? ఆమే నన్ను చంకనేసుకుంటుందేమో!

శ్రావణ మంగళవారం నోముల్లో ఆమె పూజ తరువాత తన పాదాలకు దణ్ణం పెట్టడానికి వచ్చినప్పుడు తను ప్రేమగా ఆమె తలపై అక్షతలు వేసి, ఆమెను పైకి లేపడానికి ప్రయత్నించి బోర్లాపడినట్లు-

అమ్మో... తన మోటారుసైకిలు వెనకాల కూర్చుంటే వెనక టైరు ధామ్మని పేలిపోతుం దేమో! లేక వెంటవెంటనే అరిగిపోతుందేమో!!'

...అనుకుంటూ పెళ్ళి తరువాత తమ సంసారంలోని పదనిసలు ఊహించుకుంటు న్నాడు మూర్తి.

పొలాల మధ్యలోంచి జట్కాబండి వెళ్తోంది. కనుచూపు మేర ఆకుపచ్చగా పొలాలు, పొలాల గట్లన కొబ్బరిచెట్లు, ఆ పరిసరాలూ ఎంతో మనోహరంగా వున్నాయి.

"ఇంకోటి సెప్పడం మర్సిపోయా! మా అమ్మాయిగారికి భూతద్దాల కళ్ళజోడుందండి. 'పేను కొరుకుడు' మూలాన్న జడ బెత్తెడేనండి! కళ్ళజోడు తీస్తే ఆమేకేం కనపడదండి! అయినా తవరెప్పుడూ ఆరి పక్కనే వుంటారు గదండీ..?!" అన్నాడు జట్కా బండివాడు.

వెంటనే మూర్తి "నానమ్మా... మనం వెళ్లిపోదాం! నాకు ఎందుకో భయంగా వుంది. నా ఎడమ చెయ్యి ఎందుకో లాగుతూనే వుందే బాబూ!" అన్నాడు బిక్కచచ్చిపోయి.

"అరేయ్ః... పిచ్చినాగన్నా! అమ్మాయి లావుగా వుండడం, కళ్ళజోడు ఉండడం, పిలక జడ వుండడం పెద్ద ఇబ్బంది కాదురా! అయినా ఆడపిల్ల బొద్దుగా వుండాలిరా! ఎముకలు తగులుతున్నట్లుగా వుంటే ఏం బావుంటారురా పిల్లలు? అమ్మాయి లక్ష్మీదేవిలా నిండుగా వుంటుందిలే!" అంది నానమ్మ.

ఆ ఇంటి ముందు జట్కాబండి ఆగింది!

పిల్ల తండ్రిది భారీ పర్సనాలిటీ! పాతతరం నటుడు నెల్లూరు కాంతారావు లాగా, పంచె, చొక్కాలో వున్నాడు. బండి దగ్గరికి వచ్చి కుడిచేత్తో మూర్తిని రెక్కపట్టుకుని దింపాడు. ఎడమచేత్తో నానమ్మని దింపాడు.

'అయితే ఈ ఘటోత్కచుని కూతురేగా... ఇంక చెప్పేదే ముందీ? నానమ్మా... నన్ను ముంచావు కదే..!' అనుకుంటున్నాడు మూర్తి.

పెద్దహాలులో యుద్ధరంగంలో సీన్‌లాగా ఒకవైపు పాతిక కుర్చీలు, మరోవైపు పాతిక కుర్చీలు, మధ్యలో తెల్లనిగుడ్డ కప్పిన కుర్చీ, ఎదురుగా చాప.

ఫలహారాలయ్యాక మూర్తిని నానమ్మ ఆ కుర్చీలో కూర్చోపెట్టింది. బలికి తయారవుతున్న పశువులా ఫీలయ్యాడు మూర్తి. అమ్మాయి తనకు నచ్చలేదన్నా నానమ్మ ఊరుకోదు. పైగా, అక్కడ ఊళ్లో బామ్మ ఒకర్తె!

కుర్చీల్లో కూర్చున్న ముత్తైదువులు, పెద్దమనుషులు గుసగుసలాడుకుంటున్నారు.

మూర్తి ముఖకవళికలు చూసి ఒక పెద్దామె "అబ్బాయి పీలగా, అదోలా ఉన్నాడు. జబ్బుమనిషా?" అంది. నానమ్మ వెంటనే కోపంతో-

"చాల్లేవమ్మా... రాత్రంతా రైల్లో నిద్రలేదు!" అంటూ కరిచినంత పనిచేసింది.

ఇంతలో పాతతరం సినిమా తార శ్రీదేవి కన్నా అందంగా, ఆమెకన్నా చాలా స్లిమ్‌గా, పింక్‌కలర్ చీరలో, గులాబీరంగులో మెరిసిపోతూ, నడుముకు గొలుసు వడ్డాణం, అరవంకీలు, పాపిడి పిందె, చేతులకు రాళ్లగాజులు, మెడలో స్వాతిహారం వేసుకున్న ఓ అందగత్తెను ఇద్దరాడవాళ్ళు తీసుకువచ్చి మూర్తి ఎదురుగా కూర్చోబెట్టారు.

మూర్తి ఆమెను చూస్తూనే నాయనమ్మ వైపు చూసి 'చాలా బావుంది' అన్నట్లుగా కుడిచేయి చూపుడువేలు, బొటనవేలు కలిపి చూపించి చెప్పాడు. తనకు ఎంతో ఇష్టమైన సినీనటి ప్రత్యక్షమైనంత సంబరం అతని ముఖంలో గోచరించింది. ఒళ్ళు గిల్లుకున్నాడోసారి.

అంతలోనే... మూర్తికి ఏమయిందో, ఏమిటో- ఉన్నట్టుండి 'ధామ్మని' కుర్చీలోంచి పడిపోయాడు... బియ్యంబస్తా జారిపోయినట్లుగా! ఆ తరువాత ఏం జరిగిందో తెలియదు.

కొద్దిసమయం తరువాత పెళ్ళివారింట్లో పందిరి పట్టెమంచం మీద, నీరసంగా కళ్ళు తెరిచిన మూర్తికి- ప్రక్కనే నిలబడి ఓ అమ్మాయి చిలిపిగా నవ్వుతూ "మా జట్కాబండోడు చెప్పింది విని నేను గున్న ఏనుగులా వుంటాననుకున్నారా? టెన్షన్ పడ్డారా?" అంది.

మూర్తి చెవిలో "నా పేరు సూర్యకళ, నేనూ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్నే!" అంది.

నానమ్మ పరుగులతో వచ్చింది... "వోయమ్మో మా మనవడి పైత్యం కమ్మింది నిద్రలేక! మనవరాలా... అల్లం రసం పెట్టించవే తల్లీ!" అంటూ అంది- సూర్యకళ కళ్ళ అయస్కాంత శక్తికి మూర్తి లోబడిపోతున్న ఆ సమయంలో.

●

'ఆంధ్రప్రదేశ్' మాసపత్రిక ... అక్టోబర్' 2008 సంచికలో ప్రచురితం